సంపుటి : 8
సంచిక : 132
పేజీలు : 3

# మెయిన్ టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

బుధవారం 03.12.2025

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ


## ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై రగడ

- రాజ్యసభ వాయిదా



**టి మీడియా, డిసెంబర్ 2 , ఢిల్లీ బ్యూరో :** ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ కు వ్యతిరేకంగా పార్లమెంట్ ఉభయసభల్లో విపక్షాలు ఆందోళనకు దిగాయి. ఓట్ చోరీ, గద్దీ చోరీ అంటూ ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు చేశారు. ఫలితంగా తీవ్ర గందరగోళం నెలకొన్నది. దాంతో ముందుగా లోక్‌సభ, ఇప్పుడు రాజ్యసభ రేపటికివాయిదాపడ్డాయి.లోక్‌సభలో గందరగోళంలో స్పీకర్ ముందుగా సభను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ తిరిగి ప్రారంభమైనా సేమ్ సీన్ రిపీట్ అయ్యింది. దాంతో మధ్యాహ్నం 2 గంటల వరకు సభ వాయిదా పడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సభ పునఃప్రారంభమైనా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. గందరగోళం కొనసాగింది. దాంతో స్పీకర్ సభను రేపటికి వాయిదా వేశారు.రాజ్యసభలో కూడా ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై చర్చ కోరుతూ విపక్ష ఎంపీలు ఆందోళనకు దిగారు. అయినా ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో సభ నుంచి వాకౌట్ చేశారు. ఆ తర్వాత సభలో కొన్ని అంశాలపై విపక్షాలు లేకుండానే చర్చించారు. ఆపై పెద్దల సభను రేపటికి వాయిదా వేశారు.

## అభివృద్ధితో..
# అగ్రగామిగా తెలంగాణ

- నెహ్రూ స్ఫూర్తితో పని చేస్తున్నాం
- సీతారామ పెండింగ్ పనులు పూర్తి
- ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి





**టి మీడియా, డిసెంబర్ 2 , భద్రాద్రి కొత్తగూడెం:**

ఎడ్యుకేషన్, ఇరిగేషన్ అభివృద్ధితో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా ఎదుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు వాకాటి శ్రీహరి, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, రెవెన్యూ హౌసింగ్ శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపిలు బలరాం నాయక్, రామ సహాయం రఘురాం రెడ్డిలతో కలిసి పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రి గారికి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఎస్పి బి. రోహిత్ రాజు ఘన స్వాగతం పలికారు.కొత్తగూడెంలో నెలకొల్పిన డాక్టర్ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూలి ప్రజల మద్దతుకు ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న నేపథ్యంలో డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. గతంలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ కోసం వందల ఎకరాల భూమి రైతులు ఇస్తే స్థానికులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ఉపాధి లభించడంతో మొట్టమొదటిసారి తెలంగాణ ఉద్యమానికి పునాదులు పడింది పాల్వంచ ప్రాంతంలోనని, తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ఈ ప్రాంతం అందించిందని అన్నారు. 60 సంవత్సరాల తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు ఈ విశ్వ విద్యాలయానికి పెట్టుకోవడం సంతోషంగా ఉందని అన్నారు.భారతదేశ మొదటి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం అభివృద్ధి చెందడానికి ఎడ్యుకేషన్, ఇరిగేషన్ పాలసీ అమలు చేశారని, ప్రస్తుతం దేశంలో ఉన్న గొప్ప విశ్వ విద్యాలయాలు, ఇరిగేషన్ ప్రాజెక్టులు ఆనాటి ప్రధానమంత్రినెహ్రూ ప్రారంభించినవి అని అన్నారు.బాక్రానంగల్ నుంచి నాగార్జునసాగర్ వరకు, శ్రీశైలం నుంచి శ్రీరామ్ సాగర్ వరకు నీటి పారుదల ప్రాజెక్టులను జవహర్ లాల్ నెహ్రూ నిర్మించారని తెలిపారు. దేశం మొదటి ప్రధాని స్ఫూర్తితో ఎడ్యుకేషన్, ఇరిగేషన్ తెలంగాణను దేశ పటం మీద మొదటి స్థానంలో నిలుపుతుందని తమ ప్రభుత్వం బలంగా విశ్వసిస్తుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో ఉన్న అపారమైన ఖనిజ సంపదను గుర్తించి వాటి మీద పరిశోధనలు జరగాలని ఎర్త్ యూనివర్సిటీ కొత్తగూడెంలో పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. కొత్తగూడెంకు వైద్య కళాశాల, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి యంగ్ ఇండియా సమీకృత గురుకుల నిర్మాణం వంటి గొప్ప విద్యాలయాలను ఖమ్మం జిల్లాకు అందించాలని లక్ష్యంతో ముందుకు పోతున్నామని అన్నారు. గోదావరి, కృష్ణ జలాలు ఖమ్మం జిల్లాకు వస్తాయని, ఇక్కడ ప్రాజెక్టులను పూర్తి చేసి రైతుల పొలాలకు నీరు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించిందని, సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయడంతో పాటు పెండింగ్ ఉన్న మిగిలిన అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. రాష్ట్ర పాలనకు ఆయువు పట్టు ఖమ్మం జిల్లాలో ఉందని, ఇక్కడ మంత్రులు అనుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదని అన్నారు. ప్రజలకు రేషన్ కార్డు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ చీరలు ఇటువంటి అనేక కార్యక్రమాలను ఖమ్మం జిల్లా నుంచి ప్రారంభించామని అన్నారు. భద్రాద్రి శ్రీ రామ చంద్రుని సాక్షిగా ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటున్నట్లు సీఎం తెలిపారు. ప్రజలు వేసిన ఓటు ఫలితంగా రెండు సంవత్సరాల కాలంలో



మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఎన్నికలలో మంచి అభ్యర్థులను, పని చేయగలిగే వారిని ఎన్నుకోవాలని, డబ్బులకు మద్యం బాటిళ్లకు, ప్రలోభాలకు లొంగవద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. డిసెంబర్ 8, 9 తేదీలలో జరిగే తెలంగాణ విజయోత్సవాలు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కార్యక్రమానికి ప్రధానమంత్రి రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రధాన మంత్రులను ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళు తున్నానని, మరోసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వస్తానని, ఇక్కడ ప్రజలు అందించే ప్రేమ పూర్వకమైన స్వాగతం తనకు చాలా ఉత్సాహాన్ని ఇస్తుందని సీఎం తెలిపారు.

### డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ

దేశంలో ఎక్కడా లేని విధంగా ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ప్రభుత్వం ఇక్కడ ఏర్పాటు చేస్తుందని, భూమి పరిసరాలు, భూమి లోపల ఉన్న ఖనిజాల గురించి విశ్వవిద్యాలయంలో పరిశోధనలు జరుగుతాయని, ప్రపంచానికి జ్ఞానాన్ని అందించే విద్యాలయం లకు నేడు తొలి అడుగు వేసామని అన్నారు. దేశానికే దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం నిలుస్తుందని, ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి అవసరమైన వసతులు వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని అన్నారు.

### తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ

దేశానికే తలమానికంగా ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరు మీద కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దేశంలో వినూత్న విశ్వవిద్యాలయాన్ని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు కేటాయించి నందుకు ప్రజల తరఫున సీఎంకు మంత్రి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగూడెం జిల్లాకు గోదావరి జలాలు, విద్యుత్ కేంద్రం రావాలని అన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అదనంగా నిధులు మంజూరు చేశారని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెంకు విమానాశ్రయం ఏర్పాటు చేయాలని అన్నారు.

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసిన ఆనాటి ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ పేరిట ఎర్త్ సైన్స్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని, ప్రజలు పనిచేస్తున్న ప్రజా ప్రభుత్వానికి తమ ఆశీర్వాదాలు అందించాలని అన్నారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబ శివరావు మాట్లాడుతూలి కొత్తగూడెం నియోజక వర్గంపై ప్రత్యేకమైన ప్రేమతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న, ఎర్త్ యూనివర్సిటీని ఈ ప్రాంతానికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయని, 800 మెగా వాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ఇటీవల క్యాబినెట్ ఆమోదం లభించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లు విద్యా చందన, వేణుగోపాల్, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ఆర్డీఓ మధు, ప్రిన్సిపాల్ జగన్మోహన్ రాజు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పీఎంవో భవనం పేరు మార్చిన కేంద్రం
# ఇక నుంచి సేవాతీర్థ్





**టి మీడియా, డిసెంబర్ 2 , ఢిల్లీ బ్యూరో :** ప్రధాన మంత్రి కార్యాలయం భవనం పేరును సేవాతీర్థ్?గా మారుస్తూ తాజాగా నిర్ణయం తీసుకుంది. దీంతో పీఎంవోను ఇక నుంచి సేవాతీర్థ్‌గా పిలవనున్నారు. ప్రధానమంత్రి దశాబ్దాలుగా సౌత్‌బ్లాక్‌లోని పీఎంవో నుంచి ప్రధానులు విధులు నిర్వర్తిస్తుండగా, ఆ కార్యాలయం కొత్త భవనంలోకి మారనుంది. ఈ నేపథ్యంలోనే పేరు మార్పుపై ప్రకటన వచ్చింది.సెంట్రల్ విస్టా అభివృద్ధి ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న ఈ కాంప్లెక్స్ ప్రస్తుతం తుది దశకు చేరుకుంది. ఇంతకుముందు ఈ భవనాలను ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్?గా పిలిచేవారు. అయితే పరిపాలనలో సేవా భావం ప్రాముఖ్యం పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దీనికి సేవా తీర్థ్ అనే పేరు పెట్టాలని నిర్ణయించింది.

### ఏఏ కార్యాలయాలు ఉండబోతున్నాయి?

కొత్తగా నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో పీఎంవో తో పాటు కేబినెట్ కార్యదర్శిత్వం, నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటేరియట్ ఇండియా హౌస్ ముఖ్యంగా ఉండనున్నాయి. ఇందులోని ఇండియా హౌస్ ప్రత్యేకంగా విదేశీ ప్రతినిధులు, ప్రపంచ నాయకులతో ఉన్నత స్థాయి చర్చలు జరిపే కేంద్రంగా రూపొందుతోంది. దేశ విదేశాంగ వ్యవహారాల్లో ఇది కీలక పాత్ర పోషించనుంది.

### సేవా తీర్థ్ వెనక ఉన్న భావం

పరిపాలన అనేది కేవలం అధికారాన్ని ప్రదర్శించే స్థలం కాదు, ప్రజలకు సేవలందించే కేంద్రం కావాలని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. "సేవా తీర్థ్ అనేది సేవా భావాన్ని ప్రతిబింబించే పని ప్రదేశం. దేశ ప్రాధాన్యాలు, జాతీయ నీతులు ఇక్కడే రూపుదిద్దుకుంటాయి" అని అధికారులు తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో ఇప్పుడు ఒక నిశ్శబ్దమైన కానీ లోతైన మార్పు జరుగుతోందని వారు పేర్కొన్నారు. అధికారం నుంచి సేవాభావం వైపు, ఆధిపత్యం నుంచి బాధ్యత వైపు మార్పు జరుగుతోందని వెల్లడించారు.

### దేశవ్యాప్తంగా పేర్ల మార్పులు

ఈ కాంప్లెక్స్ మాత్రమే కాదు, గత కొన్నేళ్లుగా భారత పరిపాలనలో పేర్ల మార్పుల ద్వారా విలువల్లో పెద్ద మార్పు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రాష్ట్ర గవర్నర్ల నివాసాలు అయిన రాజ్ భవన్లు, ఇప్పుడు లోక్ భవన్?లుగా మారుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, పేర్లలో పారదర్శకత, కర్తవ్య భావం ప్రతిబింబించేలా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయాల్లో ఇది ఒక భాగం. "ప్రతి పేరు, ప్రతి భవనం, ప్రతి చిహ్నం ఒకే సందేశం ఇస్తోంది. ప్రభుత్వం అంటే ప్రజల సేవ కోసం ఉన్న వ్యవస్థ" అని అధికారులు తెలిపారు.

### మునుపటి మార్పులు కూడా సేవాభావాన్నే

భారత రాజధాని ముఖచిత్రాన్ని మార్చే చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం గతంలో కూడా పలు ప్రదేశాలకు కొత్త పేర్లు పెట్టింది. రాజ్ పథ్‌ను కర్తవ్య పథ్?గా పేరు మార్చడం అందరూ గుర్తు చేసుకునే ఉదాహరణ. ప్రధాన మంత్రి అధికార నివాసానికి 2016లో లోక కళ్యాణ్ మార్గ్ అనే పేరు పెట్టారు. ఈ పేరు ప్రజా సంక్షేమం అనే భావాన్ని ప్రతిబింబిస్తుంది. కేంద్ర పరిపాలన భారీ కేంద్రంగా ఉన్న కార్యాలయ సంక్షేపం ఇప్పుడు కర్తవ్య భవన్?గా పిలుస్తున్నారు. ఇది ప్రజా సేవ ఒక బాధ్యత అని తెలియజేసే రూపకల్పనతో తయారైంది.

### వ్యవస్థ మార్పుకు ప్రతీక

"పేర్ల మార్పుకు అర్థం కేవలం పదాల మార్పు మాత్రమే కాదు. ఇది మన మనస్తత్వం మారుతున్న సంకేతం. ప్రజల ముందు బాధ్యతను ఉంచేలా పరిపాలన కొత్త భాష మాట్లాడుతోంది. సేవ, కర్తవ్యం, పౌరుడు అనే భావాలు ఇప్పుడు ప్రధానమైనవి. దేశ ప్రజలకు సేవ చేయడం ప్రభుత్వానికి ప్రధాన కర్తవ్యం అని ప్రతీ నిర్ణయం చెప్పేలా, కొత్త పేర్లు ఒక విధంగా స్ఫూర్తి కేంద్రాలుగా మారుతున్నాయి" అని అధికారులు చెప్పారు.

### తెలంగాణ రాజ్?భవన్ మార్పు

మరోవైపు, తెలంగాణ రాజ్‌భవన్ పేరు మారుస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం నోటిషికేషన్ జారీ చేసింది. రాజ్‌భవన్‌ను లోక్‌భవన్?గా మార్చింది. గవర్నర్ల అధికారిక నివాసాలకు పేరు మార్చాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించిన నేపథ్యంలో తాజాగా తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## డీకే నివాసానికి సీఎం సిద్ధరామయ్య
### కర్ణాటకలో బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు



**టి మీడియా, డిసెంబర్ 2 , బెంగళూరు :** కర్ణాటకలో నాయకత్వ మార్పు ఊహాగానాలు కొనసాగుతున్నాయి. ఈ ఊహాగానాల వేళ బ్రేక్‌ఫాస్ట్ రాజకీయాలు తెరపైకి వచ్చాయి. సీఎం మార్పుపై జరుగుతున్న ప్రచారం వేళ రెండు రోజుల క్రితం సీఎం సిద్ధరామయ్య నివాసానికి డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వెళ్లిన విషయం తెలిసిందే. తాజాగా ఇప్పుడు డీకే ఇంటికి సీఎం సిద్ధూ బ్రేక్‌ఫాస్ట్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన ఇంటికి వచ్చిన సీఎంకు డీకే ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి బ్రేక్‌ఫాస్ట్ చేశారు. బ్రేక్‌ఫాస్ట్ మీట్‌లో పలు అంశాలపై చర్చించినట్లు తెలుస్తోంది. కాగా, శనివారం ఉదయం సీఎం ఇంటికి డీకే వెళ్లిన విషయం తెలిసిందే. అల్పాహారం సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం ఇద్దరూ భేటీ అయ్యారు. అనంతరం ఇద్దరు నేతలు కలిసి పార్టీ శ్రేణులకు ఐక్యతా సందేశం ఇచ్చారు. డీకే శివకుమార్ తనను మంగళవారం అల్పాహారానికి తన ఇంటికి రావాలని కోరారని.. ఇంకా అధికారిక ఆహ్వానం అందలేదని సీఎం అన్నారు. ఆహ్వానిస్తే తాను ఖచ్చితంగా వెళ్తానని.. ఆయన నుంచి ఆహ్వానం వస్తుందని అనుకుంటున్నానన్నారు. సీఎం వ్యాఖ్యలపై డీకే శివకుమార్ స్పందిస్తూ.. ఇది తనకు సీఎంకు మధ్య ఉన్న విషయమని.. తాము అన్నదమ్ముల్లా కలిసి పని చేస్తామన్నారు. ఈ సందర్భంగా సీఎంకు తన ఇంటికి అల్పాహారానికి ఆహ్వానించారు. ఆయన ఆహ్వానం మేరకు ఇవాళ డీకే ఇంటికి అల్పాహారానికి వెళ్లారు సీఎం సిద్ధరామయ్య.

## దేశం కోసం గాంధీ కుటుంబం
# త్యాగం

- కేసులు పెడితే భయపడేది లేదు
- సీఎం రేవంత్‌రెడ్డి



**టి మీడియా, డిసెంబర్ 2 , హైదరాబాద్ బ్యూరో :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీలపై కేసులు పెడితే భయపడేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ దేశం కోసం గాంధీ కుటుంబం త్యాగం చేసిందని గుర్తుచేశారు. నేషనల్ హెరాల్డ్ సిబ్బందికి ఆర్థిక సాయం మాత్రమే అందించారని తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన పీసీసీ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి సౌకర్యాలు ఉండవని, వారి కోసం మంచి ఆలోచనతో ఆర్థికంగా ఆదుకునేందుకు షేర్ క్యాపిటల్‌కు సంబంధించి కాంగ్రెస్ పార్టీ నుంచి నిధులు బదిలీ చేసి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇచ్చారని రేవంత్? రెడ్డి తెలిపారు. ఏ ఒక్క రూపాయి ప్రభుత్వానికి సంబంధించినది కాదని, ఎవరూ జేబులో ఒక్క రూపాయి కూడా వేసుకోలేదని తెలిపారు. ఆస్తులన్నీ నెహ్రూవేనని వారసత్వంగా ఉన్న పత్రికను నడపాలని కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించినట్లు చెప్పారు. మనీలాండరింగ్ కేసు, ఈడీ కేసులు పెట్టి మానసికంగా సోనియా, రాహుల్ గాంధీలను వేధిస్తారా అంటూ బీజేపీపై మండిపడ్డారు.

### పార్టీకి పత్రిక ఉండాలనే

ఎప్పుడో మూతపడిన నేషనల్ హెరాల్డ్ పత్రిక సిబ్బందిని మంచి ఆలోచనతో ఆర్థికంగా ఆదుకున్నారని సీఎం పేర్కొన్నారు. పత్రికను తిరిగి నడిపించాలంటే బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా కొంతమంది కాంగ్రెస్ నాయకులను తీసుకున్నారన్న రేవంత్ కాంగ్రెస్ పార్టీకి ఒక పత్రిక ఉండాలని నేషనల్ హెరాల్డ్‌ను పునరుద్ధరించే ప్రక్రియ చేపట్టారని తెలిపారు.మానసిక ధైర్యం కోల్పోకుండా సోనియా, రాహుల్ గాంధీలు కేసులను ధైర్యంగా ఎదుర్కొన్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. దేశం కోసం ప్రాణాలిచ్చిన కుటుంబం నుంచి వచ్చామని, ఇలాంటి కేసులకు భయపడమని తేల్చి చెప్పారు. దేశ స్థాయిలో ఓట్ల చోరీ కార్యక్రమాన్ని బయటపెట్టే సరికి భయపడే వేధింపులు మొదలుపెట్టారని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీ ప్రచారాలను అడ్డుకోవాలనే సోనియా, రాహుల్‌పై మళ్లీ కేసులు పెట్టినట్లు ఆయన విమర్శించారు. సోనియా, రాహుల్‌పై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తూ ప్రధానికి లేఖ రాస్తున్నట్లు ప్రకటించారు. సోనియా, రాహుల్‌కు తెలంగాణ ప్రజల తరఫున అండగా నిలబడతామన్నారు

### నాలుగు విమానాశ్రయాలకు త్వరలోనే శిలాఫలకాలు

హైదరాబాద్ నగరం లోపల కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను బయటకు తరలిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు అవతల రూరల్ అగ్రికల్చరల్ రీజియన్ ఎకానమీ వస్తోందని వెల్లడించారు. తెలంగాణకు మరో నాలుగు విమానాశ్రయాలు వస్తున్నాయన్నారు. వాటికి త్వరలోనే శిలాఫలకాలు వేసుకుందామన్నారు. కోటిమంది మహిళలకు కోటి చీరలు ఇవ్వాలని నిర్ణయించి, ప్రతి ఆడబిడ్డకు ఇందిరమ్మ ప్రభుత్వం చీర రూపంలో సారె పెడుతుందని సీఎం పేర్కొన్నారు.ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబుతో మాట్లాడి మచిలీపట్నం పోర్టును తీసుకున్నామని అక్కడి నుంచి రహదారులు, రైల్వే లైన్లు వస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. వాటితో పాటే తెలంగాణకు బుల్లెట్ రైలు కూడా వస్తోందని అన్నారు. గుజరాత్‌కు ఇచ్చేవన్నీ తెలంగాణకు ఇవ్వాలని మోదీని రేపు కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రం నుంచి నిధులను ఒకటికి వందసార్లు అడుగుతామని, ఒకటికి 50 సార్లు ఢిల్లీ వెళ్తామని తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న పనులను డీసీసీ అధ్యక్షులే ప్రజలకు చెప్పాలని కొత్తగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులకు సూచించారు.

## స్వచ్ఛంద రాజీనామాలు

3లో..

# 18న నెల్లూరు మేయర్‌పై అవిశ్వాస తీర్మానం

- **జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఉత్తర్వులు జారీ**

**టీ మీడియా, డిసెంబర్ 2, నెల్లూరు :**
కార్పొరేషన్?లో వైఎస్సార్సీపీ పాలనకు అంతం పలకనున్నారు. టీడీపీ జెండా ఎగరవేసేందుకు కార్పొరేటర్లు సిద్ధం అయ్యారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మంత్రి నారాయణ, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ పావులు కదిపారు. ఈనెల 18వ తేదీన నెల్లూరు నగర మేయర్ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సర్వసభ్య సమావేశం నిర్వహించేందుకు ఆమోదం పొందారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల కాసేపటి క్రితం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 18న ఉదయం 11:30 కు సమావేశం ప్రారంభం కానుంది. మొత్తం 54 డివిజన్లు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీకి పూర్తిస్థాయిలో 42 మంది కార్పొరేటర్ల మద్దతు పలికారు.ఇదిలా ఉండగా నెల్లూరు నగర పాలక సంస్థ మేయర్ స్రవంతిపై కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు జేసీ వెంకటేశ్వర్లుకు 40 మంది కార్పొరేటర్లు నోటీసు అందజేయగా, ఇప్పుడు మరో ఇద్దరు కార్పొరేటర్లు మద్దతు పలికారు. మేయర్ దంపతులు నగర అభివృద్ధికి అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారని కార్పొరేటర్లు ఆరోపిస్తున్నారు. వారి అవినీతితో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని చెబుతున్నారు. మేయర్ దంపతుల చేతివాటంతో దస్త్రాలు కదలడంలేదని వాపోతున్నారు. ఈ మేరకు మంత్రి నారాయణకు ఇటీవలే ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు.నగరాభివృద్ధి దృష్టిపెట్టలేదు: 4 ఏళ్ల క్రితం జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ నగరంలోని 54 డివిజన్లను కైవసం చేసుకుంది. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆశీస్సులతో మేయర్ పీఠం స్రవంతి



దక్కించుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి జిల్లాలో చావు దెబ్బ తగలడంతో ఆమె తటస్థంగా ఉంటున్నారు. నగరాభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్న విమర్శలు ఉన్నాయి. నాలుగు ఏళ్లు పూర్తి కావడంతో కూటమి ప్రభుత్వం మేయర్ పీఠం పై దృష్టి సారించింది. ఆమెను పదవి నుంచి దించేందుకు అవిశ్వాసం పెట్టారు. 27 మంది సభ్యులు ఉంటే సరిపోతుంది. కానీ టీడీపీకి 40 మంది బలం ఉంది. ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఉండడంతో మేయర్ పీఠం కూటమి ప్రభుత్వ వశం కానుంది.

**ప్రతిపక్షం పార్టీ లేకపోవడంతో అక్రమాలు**
నెల్లూరు కార్పొరేషన్ రెండు నియోజకవర్గాల కలయిక. నెల్లూరు గ్రామీణం, నెల్లూరు నగరం కలిసి 54 డివిజన్లుగా కార్పొరేషన్ ఏర్పడింది. రాష్ట్రంలో అతిపెద్ద కార్పొరేషన్?లలో ఇది నాలుగోది. గత పార్టీ అధికార బలంతో 54 డివిజన్లనూ ఆ పార్టీ అభ్యర్థులు కైవసం చేసుకుంది. టీడీపీ ప్రతిపక్షంగా లేకపోవడంతో వైఎస్సార్సీపీ మేయర్ స్రవంతి, భర్త జయవర్ధన్ అనేక అక్రమాలకు పాల్పడ్డారు.కమిషనర్ సంతకం ఫోర్జరీతో కోట్ల రూపాయలు కుంభకోణం చేశారు. కార్పొరేషన్ ఉద్యోగిని బంధించి, బెదిరించిన కేసులోనూ జయవర్ధన్?పై కేసు నమోదు చేశారు. దీంతో జైలుకూ వెళ్లారు. ఎన్నికలకు రెండేళ్లు ముందుగానే ఎమ్మెల్యే కోటంరెడ్డి వైఎస్సార్సీపీ నుంచి టీడీపీలోకి రావడంతో కార్పొరేషన్?లోని ఆయన అనుయాయులు టీడీపీలో చేరారు.డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్ అనుచరులు కూడా టీడీపీలోకి వచ్చారు. అలాగే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రెండు నియోజకవర్గాల్లోని 40 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరగా ఇప్పుడు మరో ఇద్దరూ చేరారు. దీంతో కార్పొరేషన్ డివిజన్ సమావేశాలు మొక్కుబడిగా జరిగాయి. అభివృద్ధి లేకపోవడంతో మేయర్ మార్పు కీలకంగా మారింది. చివరికి మేయర్ స్రవంతిని గద్దెదించేందుకు కార్పొరేటర్లు నిర్ణయం తీసుకుని, అవిశ్వాస తీర్మానానికి నోటీసులు ఇచ్చారు. నగరంలో 54 డివిజన్లు ఉండగా వాటిని 71గా చేసేందుకు ప్రాథమికంగా విస్తరణ హద్దులు కూడా నిర్ణయించారు. కోఆప్షన్ సభ్యులతో పాటు కార్పొరేటర్ల సంఖ్య పెరగనుంది.

## సబ్‌వేలో చిక్కుకుపోయిన మెట్రో రైలు

- **కాళ్లకు పనిచెప్పిన ప్రయాణికులు**

**టి మీడియా ,డిసెంబర్ 2 , చెన్నై:**
వారంతా ఉదయాన్నే మెట్రో రైలు ఎక్కారు. ప్రయాణికులు మార్నింగ్ చేయలేదు అనుకుందో.. ఏమో.. ఆ రైలు.. ఒక్కసారిగా ఆగిపోయింది. ఎంతకూ కదలకపోవడంతో ప్రయాణికులు తమ కాళ్లకు పని చెప్పారు. పట్టాల వెంట ఒకరి వెనక వెనక ఒకరు సబ్‌వేలో నడుచుకుంటూ





తదు పరి స్టేషన్‌కు చేరుకున్నారు. ఈ ఘటన చెన్నై మెట్రోలో చోటు చేసుకున్నది.మంగళవారం ఉదయం చెన్నై మెట్రోకి చెందిన రైలు విమ్కో నగర్ డిపో నుంచి చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్తున్నది. ఈక్రమంలో సెంట్రల్ మెట్రో %-% హైకోర్టు స్టేషన్ మధ్య సబ్‌వేలో ఒక్కసారిగా ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సాంకేతిక లోపం , విద్యుత్ సరఫరాలో సమస్య తలెత్తడంతో రైలు అక్కడి నుంచి కదల్లేదు. దీంతో మధ్యలోనే దిగిన ప్రయాణికులు రైల్వే ట్రాక్‌పై నడవాల్సి వచ్చింది. సెంట్రల్ మెట్రో %-% హైకోర్టు స్టేషన్ మధ్య ఉన్న మెట్రో రైలు బ్లూ లైన్‌లో సాంకేతిక లోపం, విద్యుత్తు సరఫరాలో సమస్యతో అసౌకర్యం తలెత్తినట్లు చెన్నై మెట్రో అధికారులు తెలిపారు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి అధికారులు క్షమాపణలు కోరారు. సమస్య పరిష్కారమవడంతో రైలు సేవలు తిరిగి ప్రారంభమయ్యాయని వెల్లడించారు.మెట్రో రైలు 10 నిమిషాల పాటు సబ్‌వేలో నిలిచిపోయిందని, దీంతో అక్కడి నుంచి 500 మీటర్ల దూరంలో ఉన్న హైకోర్టు మెట్రో స్టేషన్‌కు పట్టాల మీదుగా నడిచివెళ్లాలని అధికారులు కోరినట్లు ప్రయాణికులు చెప్పారు. ప్రస్తుతం ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

# నెల రోజులు రాకపోతే ఉద్యోగం పోయినట్టే

- **ప్రభుత్వ పాఠశాల టీచర్లు జాగ్రత్త**

**టి మీడియా, డిసెంబర్ 2 , హైదరాబాద్ బ్యూరో :**
ప్రభుత్వ పాఠశాలల్లో కొందరు టీచర్లు వేళాపాళా లేకుండా ఇష్టానుసారం వచ్చి వెళ్తుంటారు. అకస్మాత్తుగా సెలవులు పెడుతుంటారు. అలా చేయడం ఇక నుంచి కుదరదు. చెప్పా పెట్టకుండా, అధికారికంగా సెలవు పత్రం ఇవ్వకుండా విధులకు వరుసగా నెల రోజుల పాటు గైర్హాజరైతే వారిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ సోమవారం ముఖ గుర్తింపు హాజరు (ఎఫ్ఆర్ఎస్), మధ్యాహ్న భోజనం పథకం అమలు తదితర అంశాలపై జిల్లాల డీఈఓలతో ఆన్‌లైన్‌లో సమీక్షించారు.



ఎఫ్ఆర్ఎస్ అమలు తర్వాత ఉపాధ్యాయుల హాజరు శాతం, అనధికారిక గైర్హాజరు వంటి తదితర అంశాలపై చర్చించారు. ఈ వివరాలు డీఈఓలకు కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నందున వాటిపై తరచూ సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు వరుసగా నెలరోజులపాటు అనుమతి లేకుండా విధులకు హాజరు కాకుంటే షోకాజ్ నోటీసు జారీ చేసి, విచారణ చేసి, ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు గెజిట్‌లో ప్రచురించాలని డీఈఓలకు సూచించారు. వాస్తవానికి ఒక రోజు అనధికారికంగా పాఠశాలకు రాకున్నా చర్యలు తీసుకోవచ్చని కాకపోతే అకస్మాత్తుగా అనారోగ్యం బారిన పడ్డానని, రోడ్డు ప్రమాదానికి గురయ్యానని ఇలా ఏదో ఒక సాకు చూపి కోర్టుల్లో కేసులు వేస్తారన్న చర్చ కూడా జరిగింది. దాంతో నెల రోజులు వరకు వేచి చూసి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని చెప్పారు.

**ఆలస్యంగా వచ్చేవారిపైనా**
గత ఆగస్టు నుంచి అమల్లోకి వచ్చిన ముఖగుర్తింపు హాజరు ద్వారా టీచర్లు వచ్చిన, వెళ్లిన సమయం రికార్డు అవుతుంది. కాకపోతే ఈ వేళల్ని ఎవరూ అంత కచ్చితంగా పట్టించుకోవడం లేదు. విధులకు హాజరయ్యారా? లేదా? అన్నదే పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇకనుంచి ఆలస్యంపై కూడా దృష్టి సారిస్తామని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ముఖ గుర్తింపు హాజరు అమలుతో హెడ్?మాస్టర్?లకు ఇబ్బందులు తప్పాయి. గతంలో కొంత ఆలస్యంగా వస్తా, ముందుగా వెళతా అని కొందరు అడిగేవారు. భవిష్యత్తులో ఏ సమయానికి వచ్చారు, వెళ్లారనే లెక్కలు కూడా తీస్తారన్న ఆలోచనతో ప్రస్తుతం తమను ఎవరూ అడగడం లేదని గెజిటెడ్ హెచ్ఎం ఒకరు చెప్పారు.

**రెండేళ్లలో 50 మంది టీచర్ల తొలగింపు**
ఏటా కొందరు టీచర్లు లాంగ్? లీవ్?లపై వెళ్తుంటారు. అలాంటి వారు ఎక్కువగా విదేశాల్లో ఉన్న తమ పిల్లలు, భాగస్వాముల వద్దకు వెళ్తారు. ఆరు నెలలని అనుమతి తీసుకొని ఒకటి, రెండేళ్లైనా విధులకు రాని వారు సైతం ఉన్నారు. అలాంటి వారిని గత రెండేళ్లలో సుమారు 50 మందిని ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించామని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. కొందరు కనీసం సెలవులను పొడిగించుకుంటామని కూడా సమాచారం ఇవ్వడం లేదని వెల్లడించారు. ఇలా దీర్ఘకాలికంగా విధులకు హాజరు కానివారికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేసి, ఉద్యోగం నుంచి తొలగించే చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. రాష్ట్రంలో దాదాపు 24 వేల పాఠశాలల్లో సుమారు 1.15 లక్షల మంది టీచర్లు ఉండగా వారిలో 6,100 మంది ఇతర పాఠశాలలు, విద్యాశాఖలోని ఇతర విభాగాల్లో డిప్యుటేషన్లపై విధులు నిర్వహిస్తున్నారు.



## ఎస్టీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

- **12 మంది విద్యార్థులకు అస్వస్థత**

**టి మీడియా ,డిసెంబర్ 2 , గద్వాల:**
ప్రభుత్వ హాస్టళ్లలో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ రేవంత్ రెడ్డి సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నా, ప్రాణాలు కోల్పోతున్నా పట్టించుకోవడం లేదు. తాజాగా గద్వాల ఎస్టీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ జరిగింది. కలుషిత ఆహారం తినడంతో 13 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో సిబ్బంది వారిని గద్వాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు.

## భార్యను చంపి భర్త ఆత్మహత్య

**టీ మీడియా, డిసెంబర్ 2, టేక్మాల్ ప్రతినిధి:**
టేక్మాల్ మండలంలోని బర్దిపూర్ గ్రామంభార్యను చంపి భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బర్దిపూర్ గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బర్దిపూర్ గ్రామానికి చెందిన గంగారం శ్రీశైలం (37), మంజుల (34) దంపతులకు ఒక కుమారుడు ఉన్నాడు మంగళవారం ఉదయానికి మంజుల హత్యకు గురికాగా శ్రీశైలం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు సమాచారం అందించారు. టేక్మాల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగారం శ్రీశైలం మంజుల గత కొన్ని సంవత్సరాలుగా జీవన ఉపాధి కొరకు హైదరాబాదులో ఉండేవారు హైదరాబాద్ నుండి సుమారుగా మూడు నెలల క్రితం బర్దిపూర్ గ్రామానికి వచ్చి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు వారి కుటుంబ కలహాలతో భార్యను చంపి తన ఆత్మహత్య చేసుకున్నాడు. టేక్మాల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామనితెలిపారు .



## నామినేషన్లు.. ఏర్పాట్లలో విఫలమైన ప్రభుత్వం

**టి మీడియా, డిసెంబర్ 2 , కొల్లాపూర్ :**
నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజక వర్గంలో రెండో దఫా నామినేషన్ల ముగింపు రోజైన మంగళవారం సర్పంచ్, వార్డ్ మెంబర్ స్థానాలకు నామినేషన్లు వేసేందుకు నామినేషన్ కేంద్రాలకు అభ్యర్థులు భారీ ఎత్తున తరలివచ్చారు. సమయం సమీపిస్తుండడంతో తమ నామినేషన్ పత్రాలను ముందుగా తీసుకోవాలని అభ్యర్థులు పోటీ పడడంతో కొన్ని నామినేషన్ కేంద్రాలలో గందరగోళం నెలకొంది. సింగోటంలోని నామినేషన్ కేంద్రంలో సింగోటం, యన్మన్ బెట్ల, మాచినేనిపల్లి గ్రామాల నుంచి అభ్యర్థులందరూ నామినేషన్ కేంద్రంలోకి రావడంతో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది.పోలీసులు జోక్యం చేసుకొని అభ్యర్థులు కానివారిని నామినేషన్ కేంద్రం నుంచి బయటకు పంపించారు. సింగోటం, కుడికిల్ల, ఎల్లూరు, రామాపురం నామినేషన్ కేంద్రాలలో కూడా ఇదే గందరగోళ పరిస్థితి నెలకొన్నది. పెద్దకొత్తపల్లి, కోడేరు, పెంట్లవెల్లి మండలాల పరిధిలోని నామినేషన్ కేంద్రాలలో కూడా భారీ ఎత్తున అభ్యర్థులు తరలి రావడంతో నామినేషన్ కేంద్రాలన్నీ జనసంచారంతో నిండి ఉన్నాయి. అరకొర బందోబస్తు .. నామినేషన్ కేంద్రాలలో చివరి రోజైన మంగళవారం నామినేషన్ వేసేందుకు అభ్యర్థులు తమ అనుచరులతో తరలి రావడంతో జన సందోహాన్ని కంట్రోల్ చేసేందుకు సరిపడా బందోబస్తు లేదు. నామినేషన్ కేంద్రాలలో ఇద్దరు చొప్పున మాత్రమే పోలీస్ బందోబస్తు ఉన్నది. చివరి రోజు నామినేషన్ వేసేందుకు వస్తున్న వారిని పోలీసులు కంట్రోల్ చేయలేని పరిస్థితి నెలకొన్నది. సమస్యాత్మక సున్నితమైన గ్రామాలలో సైతం సరిపడా బందోబస్తు లేకపోవడం విడ్డూరంగా ఉంది. నామినేషన్ కేంద్రాలలో నామినేషన్ల ప్రక్రియ వరకు కొనసాగే అవకాశం ఉన్నది.



## బీజేపీ అభ్యర్థిగా సోనియా గాంధీ

- **కాంగ్రెస్‌కు తలనొప్పిగా ఎన్నికలు**

**టి మీడియా ,డిసెంబర్ 2 , కేరళ :**
కేరళరాష్ట్రంలో విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. అక్కడ స్థానిక ఎన్నికల్లో బీజేపీ తన అభ్యర్థిగా 'సోనియా గాంధీ ని నిలబెట్టింది. కమలం పార్టీ నిర్ణయం అక్కడి కాంగ్రెస్ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారింది.ఇంతకీ ఏం జరిగిందంటే.. మరో వారం రోజుల్లో కేరళ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. రెండు దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. డిసెంబరు 9, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. 13న ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ఎన్నికల కోసం ప్రధాన పార్టీలుసమయాత్తమవుతున్నాయి. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పోటాపోటీగా అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. ఇక ఈ ఎన్నికల్లో కమలం పార్టీ వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. కాంగ్రెస్‌ను దెబ్బతీసేందుకు వ్యూహాలకు పదునుపెడుతోంది. ఇందులో భాగంగానే మున్నార్ పంచాయతీ ఎన్నికల్లో 'సోనియా గాంధీ' అనే మహిళను బరిలోకి దింపింది.ఇక ఈ స్థానానికి హస్తం పార్టీ మంజుల రమేష్‌ను నిలబెట్టింది. అయితే, ప్రత్యర్థి పేరు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ పేరు కావడంతో ఆ పార్టీకి ఇది పెద్ద తలనొప్పిగా మారింది. సోనియా గాంధీ పేరుండడం వల్ల ఎన్నికల సమయంలో ఓటర్లు గందరగోళానికి గురయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమవుతోంది. అదే సమయంలో బీజేపీ అభ్యర్థి 'సోనియా గాంధీ' పేరు స్థానికంగా మార్మోగిపోతోంది. ఆ మహిళ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.




# ప్రేమ పెళ్లి-3 నెలలకే కట్నం వేధింపులు

- **ఐఏఎస్ కుమార్తె ఆత్మహత్య**

**టి మీడియా, డిసెంబర్ 2 , గుంటూరు:**
పాతికేళ్లు కంటికి రెప్పలా చూసుకున్న తల్లిదండ్రులను కాదని ప్రేమ పెళ్లిళ్లు చేసుకుంటున్న వారిని మనం చూస్తూనే ఉన్నాం. కష్టమో, నష్టమో భరించి, ఏళ్లపాటు ఎదురుచూసి కన్నవారు ఒప్పుకున్నాక ఒక్కటైన ప్రేమ జంటలూ లేకపోలేదు. తాడేపల్లిలోని ఓ ఐఏఎస్? అధికారి కుమార్తె ప్రేమ పెళ్లి చేసుకుంది. ముందు ఒప్పుకోకపోయినా తరువాత తల్లిదండ్రులు వాళ్ల నిర్ణయాన్ని స్వాగతించారు. అయితే డబ్బుపై అత్యాశతో భార్యను అదనపు కట్నం తేవాలని భర్త ఇబ్బందులకు గురి చేశాడు. వీటన్నింటినీ తట్టుకుని నిలబడినంత కాలం ఏమీ జరగనట్టే ఉన్నా చివరకు తాను తనువు చాలించింది. ఇలా వరకట్నం వేధింపులు తట్టుకోలేక ఎందరో మహిళలు తప్పటడుగులు వేస్తున్నారు. నూరేళ్ల జీవితాన్ని చీకటి చేసుకుంటున్నారు.

**అసలేం జరిగిందంటే**
పెళ్లైన కొద్ది నెలలకే ఓ ఐఏఎస్ అధికారి కుమార్తె ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో నివాసం ఉంటున్న సీనియర్ ఐఏఎస్ చిన్నరాముడు కుమార్తె మాధురి సాహితీబాయి (27) ఆదివారం రాత్రి తన గదిలోని బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుంది. నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం బుగ్గనపల్లి తండాకు చెందిన రాజేష్‌నాయుడిని 2025 మార్చిలో ఆమె ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది.



**ప్రేమ పెళ్లి - కట్నం కోసం వేధింపులు**
వివాహమైన మూడో నెల నుంచి భర్త తనను వేధిస్తున్నాడంటూ తల్లిదండ్రులకు ఆమె తెలియజేయగా, కుమార్తెను అక్కడి పోలీసుల సహకారంతో రెండు నెలల కిందట తాడేపల్లిలోని నివాసానికి తీసుకువచ్చారు. అప్పటి నుంచి ఆమె పుట్టింట్లోనే ఉంటోంది. ఈ నేపథ్యంలో ఆదివారం బలవన్మరణానికి పాల్పడింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. తల్లి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**అదనపు కట్నం కోసం వేధింపులు**
ఐఏఎస్? అధికారి చిన్నరాముడు మీడియాతో మాట్లాడుతూ ఉద్యోగం ఉందని మోసం చేసి తమ కుమార్తెను రాజేష్‌నాయుడు మహానందిలో రిజిస్టర్ మ్యారేజీ చేసుకున్నాడని ఆరోపించారు. పెద్దల సమక్షంలో మళ్లీ పెళ్లి చేస్తామని చెప్పి అతడితో తమ కుమార్తెను పంపినట్లు ఆయన వివరించారు. ఈ క్రమంలో ఆమెను అదనపు కట్నం తెమ్మంటూ రాజేష్ వేధింపులకు గురి చేశాడని చిన్న రాముడు తెలిపారు.సాహితీబాయికి తానే దిక్కు అని, చెప్పినట్లు నడుచుకోకుంటే చంపేస్తానని బెదిరించేవాడని ఆయన అన్నారు. కనీసం తమకు ఫోన్ చేయాలన్నా భర్త అనుమతి తీసుకోవాల్సి వస్తోందని, అక్కడ ఉండలేనని కుమార్తె చెప్పడంతో రెండు నెలల కిందట ఇంటికి తీసుకొచ్చినట్లు మాధురి తండ్రి తెలిపారు. వచ్చిన నాటి నుంచి తన భర్తది నిజమైన ప్రేమ కాదని, అందుకే తీసుకెళ్లేందుకు రావడం లేదని కుమార్తె బాధపడుతూ ఉండేదని ఆయన అన్నారు. కానీ కుమార్తె ఇంత ఘాతుకానికి పాల్పడి ఇలా దూరమవుతుందని అనుకోలేదని మాధురి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# నర్సింగ్ విద్యార్థినిపై కెమికల్ దాడి

- **హనుమకొండ జిల్లాలో కలకలం**

**టి మీడియా ,డిసెంబర్ 2 ,హనుమకొండ:**
ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఓ నర్సింగ్ కళాశాల విద్యార్థిని కాళ్లపై అకస్మాత్తుగా గుర్తు తెలియని రసాయనం పడి గాయాలైన ఘటన హనుమకొండ జిల్లా కాజీపేట సమీపంలోని కడిపికొండ ప్రాంతంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలానికి చెందిన విద్యార్థిని తన అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఈ విద్యార్థిని హనుమకొండలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. రోజూ బస్సులో కళాశాలకు వెళ్లే విద్యార్థిని, సోమవారం తన స్కూటీపై వెళ్లి, అక్కడి నుంచి తిరిగి అమ్మమ్మ ఇంటికి తిరుగు ప్రయాణమైంది.



**కాలు భాగంలో గాయం**
కడిపికొండ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో గ్రామ పంచాయతీ పాత భవనం వద్దకు రాగానే కాళ్లపై ఏదో పడినట్లుగా ఆమెకు అనిపించింది. ఆగి చూసుకోగా మొదట చల్లగా, ఆ తర్వాత కాళ్లపై మంటగా అనిపించింది. చుట్టుపక్కలవారు ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ఆమెను 108 వాహనంలో ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాలు భాగంలో గాయమైనట్లు డాక్టర్లు చెప్పారు. ఘటన జరిగిన ప్రాంతంలో రోడ్డు పక్కగా ఆపి ఉంచిన బైక్?పై కూర్చొన్న 40 నుంచి 50 ఏళ్ల వ్యక్తి రసాయనం తనపై పోసి ఉంటాడని బాధితురాలు ఆసుపత్రికి వచ్చిన స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.విద్యార్థిని తండ్రి జఫర్‌గడ్ మండల కేంద్రంలో వ్యవసాయం చేస్తుంటారు. ఘటనా స్థలంలో పసుపు రంగు ద్రావణం పోసి ఉన్న ప్లాస్టిక్ డబ్బాను స్వాధీనం చేసుకున్నట్లు మడికొండ సర్కిల్? ఇన్?స్పెక్టర్? కిషన్ చెప్పారు. అందులో ఉన్నది గుర్తు తెలియని కెమికల్?గా పేర్కొన్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాల్లోని ఫుటేజీలను పరిశీలిస్తున్నట్లు, సెక్షన్ 124(2) కింద కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

**వెంబడించి దాడి చేశారా**
విద్యార్థిని స్కూటీపై ప్రయాణిస్తున్న సమయంలో ఓ వ్యక్తి మరో వాహనంపై వెనుక నుంచి వెంబడించినట్లు అక్కడి స్థానికులు చెబుతున్నారు. సదరు వ్యక్తి విద్యార్థిని ఏ మార్గంలో ప్రయాణిస్తుందనే సమాచారాన్ని మరో వ్యక్తికి మొబైల్? ఫోన్లో చేరవేసినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ క్రమంలోనే ఎదురుగా మరో వాహనంపై వచ్చిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు వాహనం ఆపి విద్యార్థిపై రసాయనం చల్లినట్లుగా కూడా స్థానికంగా ప్రచారం జరుగుతోంది. విద్యార్థిని హెల్మెట్? ధరించడంతో తల భాగంలో మాత్రం ఎలాంటి గాయం కాలేదంటున్నారు. యాసిడ్ దాడిగా ప్రచారం జరగటంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది.

**బాత్?రూం క్లీనింగ్ కెమికల్?**
2008లో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థినులపై అప్పట్లో యువకులు యాసిడ్ దాడి చేసిన ఘటన హల్?చల్? అయ్యింది. అందులో ఓ విద్యార్థిని దురదృష్టవశాత్తు ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత నిందితులైన యువకులు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమవడం తెలిసిందే. ప్రస్తుత ఘటనపై ఉపయోగించింది మూత్రశాలలు, మరుగుదొడ్లు శుభ్రం చేసే కెమికల్? మాదిరిగా ఉందని పోలీసులు భావిస్తున్నారు. దానిని పరిశీలన కోసం ల్యాబ్?కు పంపినట్లు తెలిపారు. అయితే విద్యార్థిని కాళ్లపై ఎలా పడిందనే విషయం మాత్రం తెలియటం లేదంటున్నారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గంజాయి మూకను కఠినంగా శిక్షించాలి

- **సిఐటియు డిమాండ్**

**టీ మీడియా, డిసెంబర్ 2,రైల్వే కోడూరు:**
నెల్లూరులో, సిపిఎం నేత, ప్రజానాట్య మండలినాయకుడు, యువకుడు పెంచలయ్య ని గంజాయి మూకలు దాడిచేసి హత్య చేసారు. ఎవరైతే పెంచలైను హత్య చేశారో వాళ్లందర్నీ కఠినంగా శిక్షించాలని పెంచలయ్య కుటుంబానికి న్యాయం జరగాలని ఇటువంటి దారుణాలు పునరావృతం కాకుండా చూడాలని,రాష్ట్రంలో గంజాయి మాఫియా ను అరికట్టాలని ఈ ప్రభుత్వానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, మంగళవారం రైల్వే కోడూరు సిఐటియు ఆఫీసులో విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. వెంటనే పెంచలయ్య కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేసారు.ముందుగా పెంచలయ్య గారికి నివాళు లర్పించి. ఆయన మాట్లాడు తూ, పెంచలయ్య, గ్రామాల్లోనూ కాలనీలో, యూత్ ను, ప్రజలను, చైతన్యవంతులు చేస్తూ, గట్టి కార్యకర్త అన్నారు. గంజాయి,డ్రగ్స్,మత్తు పదార్థాలు వ్యాపారం చేస్తూ దాడు లకి పాల్పడుతున్నారో వారిని అరికట్టెందుకు రాష్ట్ర ప్రభుత్వం,పోలీస్ శాఖ గట్టి నిగా వ్యవస్థ ను ఏర్పాటు చెయ్యాలనిడిమాండ్ చేశారు. రైల్వే కోడూరు నియోజకవర్గంలో, విపరీతంగా గంజాయిల్లో యువత మత్తులో ఊగుతుందని, గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా, జరిగిందని, నేటి ప్రభుత్వంలో కూడా అదే ధోరణి కొనసాగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం దీన పైన ప్రత్యేక దృష్టి పెట్టి అరికట్టాలని రిమాండ్ చేశారు.ప్రజలంతా పెంచలయ్య హత్యను తీవ్రంగా కండి%శీ% చాలని కోరారు.ఈ కార్యక్రమం లో, సిఐటియు, మండల కార్యదర్శి పి ,జాన్ ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, మండల సహాయ కార్యదర్శి, నగిరిపాటి ఆనంద్, బండారు రాజశేఖర్. తదితరులు పాల్గొన్నారు.




## హెూటళ్లపై ఐటీ దాడులు

**టి మీడియా, డిసెంబర్ 2 , హైదరాబాద్:**
నగరంలో కొన్ని ప్రముఖ హెూటళ్లు, వ్యాపార సంస్థలపై ఆదాయపు పన్ను శాఖ మంగళవారం సోదాలు కొనసాగుతున్నాయి. లక్డీకాపూల్ లోని వుడ్ బ్రిడ్జ్ హెూటల్ లో అధికారులు తనిఖీలు నిర్వహించి, అనంతరం హెూటల్ యజమాని హర్షద్ ను ప్రశ్నించారు. హెూటళ్లో భారీగా నగదు, ధ్రువపత్రాలు గుర్తించామని, ప్రముఖ హెూటళ్ల లింక్స్ హెూటళ్లపైనా దృష్టి పెట్టినట్లు ఐటీ అధికారులు తెలిపారు. పిస్తా హౌస్, షా గౌస్, మేహిఫిల్ వంటి హెూటళ్లతో పాటు క్యాప్స్ గోల్డ్ వంటి వ్యాపార సంస్థలతో సంబంధాలపై అధికారులు విచారించారు. గతంలో కూడా పిస్తా హౌస్, షా గౌస్, మేహిఫిల్ వంటి హెూటళ్లలో ఐటీ అధికారులు సోదాలు చేశారు.



# స్వచ్ఛంద రాజీనామాలు

- ఆమోదించండి
- మండలి ఛైర్మన్‌తో ఎమ్మెల్సీలు




**టి మీడియా, డిసెంబర్ 2 , అమరావతి బ్యూరో :**

మండలి సభ్యత్వానికి రాజీనామాపై హైకోర్టు ఆదేశాలను ఎమ్మెల్సీ జయ మంగళ వెంకటరమణ శాసనమండలి ఛైర్మన్ మోషేన్ రాజుకు అందజేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆరుగురు ఎమ్మెల్సీలు వైఎస్సార్సీపీతో పాటు తమ సభ్యత్వానికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖలను మండలి ఛైర్మన్ మోషేన్‌రాజుకు ఇచ్చారు. మండలిలో డిప్యూటీ చైర్ పర్సన్ జాకీయా ఖానమ్, పోతుల సునీత, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్‌తో పాటు జయమంగళ వెంకటరమణ రాజీనామాలు నెలలు తరబడి మండలి ఛైర్మన్ వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయి. వీటిని ఆమోదించాలని పలుమార్లు స్వయంగా ఛైర్మన్‌ను కలిసి కోరినా నిర్ణయం తీసుకోలేదు. దీనిపై జయమంగళ వెంకటరమణ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారించిన హైకోర్టు 4 వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని మండలి ఛైర్మన్‌కు హైకోర్ట్ ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాలతో జయమంగళ వెంకటరమణ సహా మిగతా ఆరుగురు ఎమ్మెల్సీలు మండలి ఛైర్మన్‌ను కలిశారు. రాజీనామాలను త్వరగా ఆమోదించాలని కోరారు. జగన్ విధానాలు నచ్చక రాజీనామాలు చేశాం: ఈ క్రమంలో మండలి ఛైర్మన్?కు రాజీనామా చేసిన ఎమ్మెల్సీలకు మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. వైఎస్సార్సీపీలో ఉండలేక స్వచ్ఛందంగా రాజీనామా చేశామనే సమాధానం ఎన్ని సార్లు చెప్పమంటారని ఛైర్మన్ మోషేన్ రాజును ఆరుగురు ఎమ్మెల్సీలు ప్రశ్నించారు. ఎవరి ప్రోద్భలంతోనైనా, లేక ప్రలోభాలకు లోనై రాజీనామాలు చేశారా అని ఎమ్మెల్సీలను మండలి ఛైర్మన్ అడగ్గా జగన్ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చకే స్వచ్ఛందంగా రాజీనామాలు చేశామని ఎమ్మెల్సీలు స్పష్టం చేసారు. వైఎస్సార్సీపీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీలు మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు మధ్య సుదీర్ఘ చర్చ జరిగింది. పదవీకాలం తక్కువే ఉన్నందున ఎమ్మెల్సీలుగా కొనసాగవచ్చు కదా అని ఛైర్మన్ సూచించారు. రాజీనామా ఉపసంహరణ పునరాలోచన ఏమైనా ఉందా అని ఎమ్మెల్సీలను అడిగారు. జగన్ వద్ద, వైఎస్సార్సీపీలో కొనసాగే ఉద్దేశం లేకే రాజీనామాలు చేశామని ఎమ్మెల్సీలు తేల్చిచెప్పారు. సభ్యుడు స్వచ్ఛందంగా రాజీనామా చేయలేదనే అనుమానం ఉంటే మాత్రమే విచారణ జరపాలని రాజ్యాంగం చెప్తోందని ఎమ్మెల్సీలు వెల్లడించారు. రాజీనామా పత్రాలు స్వయంగా తామే తీసుకొచ్చి ఇచ్చినా, ఇప్పటికీ అనేక సార్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశామనే విషయం చెప్పామని ఎమ్మెల్సీలు గుర్తు చేశారు.

**ఎన్నిసార్లు అడిగినా ఇదే సమాధానం**

ఇప్పటికీ అదే మాటకు కట్టుబడి ఉన్నామని ఇంకా ఎన్నిసార్లు అడిగినా తమది ఇదే సమాధానం అని ఎమ్మెల్సీలు తెలిపారు. అసలు ఎందుకు రాజీనామాలు చేశారని ఛైర్మన్ ప్రశ్నించగా అది రాజ్యాంగం తమకు కల్పించిన హక్కు అని సమాధానం ఎమ్మెల్సీలు ఇచ్చారు. 2024 ఆగస్టులో తాము రాజీనామాలు చేశామని ఇప్పటికీ 15 నెలలు దాటిపోయిందని కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణ చక్రవర్తి, పోతుల సునీతలు వెల్లడించారు. తాను గత ఏడాది నవంబర్?లో రాజీనామా చేసినందున తనదీ ఏడాది దాటిపోయిందని జయమంగళ వెంకట రమణ అన్నారు. తాము స్వచ్ఛందంగా రాజీనామాలు చేయలేదని ఒప్పించే తపన ఛైర్మన్?లో ఎందుకు ఉందో అర్థం కావట్లేదని ఎమ్మెల్సీలు వ్యాఖ్యానించారు. రాజీనామా అంశంపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయనందుకు మండలి ఛైర్మన్?కు న్యాయస్థానం ఫైన్ విధించడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమేమో అని ఎమ్మెల్సీలు అన్నారు. విచక్షణాధికారం పరిధి దాటి ఛైర్మన్ ప్రశ్నలు వేసినా సంయమనంతో సమాధానం ఇచ్చామని ఎమ్మెల్సీలు తెలిపారు

## ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" ప్రచారాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ సునిత రెడ్డి

**టి మీడియా, డిసెంబర్ 2 , వనపర్తి :**



సైబర్ భద్రత అనేది ప్రభుత్వం%–%పోలీసులు%–%ప్రజల అందరి భాగస్వామ్యం. అందరరం కలిసి కట్టుగా సైబర్ నేరాలు డిజిటల్ తెలంగాణను రక్షిద్దామని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఐపీఎస్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్ బి) ప్రజల్లో సైబర్ భద్రతపై పెద్దఎత్తున అవగాహన సృష్టించేందుకు "ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్" పేరుతో ప్రత్యేక 6 వారాల ప్రచార కార్యక్రమాన్ని 02 డిసెంబర్ 2025 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమం రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్ తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీపీ షికా గోయల్ ఐపీఎస్ సీనియర్ అధికారుల సమక్షంలో హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని టీజిఐసీసీసీ ఆడిటోరియంలో ఘనంగా ప్రారంభమైయింది. ఈ కార్యక్రమాన్ని వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో ప్రభుత్వ వైద్య కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బాలుర జూనియర్ కళాశాల, విద్యార్థినీ విద్యార్థులతో ఏర్పాటు చేసిన "ఫ్రాడ్ క ఫుల్ స్టాప్"సైబర్ అవగాహన ప్రచారాన్ని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... డిజిటల్ ప్రపంచంలో మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది. అవగాహనే ఆయుధం. ప్రతిజ్ఞ చేసిన ప్రతి విద్యార్థి తనతో పాటు తన కుటుంబాన్ని కూడా రక్షించే సైబర్ వారియర్ అవ్వాలని ప్రేరణాత్మకంగా అన్నారు. గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వరరావు, డిసిఆర్బి డీఎస్పీ, బాలాజీ నాయక్, వనపర్తి సిఐ, కృష్ణయ్య, కొత్తకోట సిఐ, రాంబాబు, ఆత్మకూరు సిఐ, శివకుమార్, ఇన్స్పెక్టర్లు, అప్పల నాయుడు, శ్రీనివాస్, సైబర్ క్రైమ్ ఎస్సై, రవి ప్రకాష్, సైబర్ క్రైమ్ పోలీసు సిబ్బంది, ప్రభుత్వ వైద్యకళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మరియ బాలుర జూనియర్ కళాశాల, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పవన్ సినిమాలు ఆడవు

- మంత్రి కోమటిరెడ్డి



**టి మీడియా, డిసెంబర్ 2 , హైదరాబాద్ బ్యూరో :**

ఇటీవల తెలంగాణ నాయకులపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. కోనసీమకు తెలంగాణ నాయకుల దిష్టి తగిలిందనే వ్యాఖ్యలు బాధకరమన్నారు. తెలంగాణ ప్రజల దిష్టి కాదు.. ఆంధ్రా పాలకుల వల్ల తెలంగాణలోని ప్రజలు ఫ్లోరైడ్ విషం తాగారని మండిపడ్డారు. చిరంజీవి సూపర్ స్టార్, ఆయన మంచోడన్న మంత్రి కోమటిరెడ్డి రాజకీయ అనుభవం లేకనే పవన్ ఇలా మాట్లాడుతున్నారని వెల్లడించారు. తెలంగాణ ప్రజలను అవమానిస్తే ఊరుకోమని హెచ్చరించారు. పవన్ కళ్యాణ్ వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చేప్పాలని డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పకపోతే తెలంగాణలో పవన్ సినిమాలు ఆడనివ్వబోమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

## జిల్లా ఇన్చార్జి మంత్రికి స్వాగతం

**టి మీడియా, డిసెంబర్ 2 ,నిర్మల్ :**



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో బుధవారం పర్యటించనున్న నేపథ్యంలో జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం నిర్మల్ జిల్లాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గం ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు నివాసంలో తేనేటి విందుకు హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మంత్రికి పుష్పగుచ్చం అందించి ఘన స్వాగతం పలికారు. స్థానిక సంస్థల ఎన్నికలపై శ్రీహరిరావుతో మంత్రి చర్చించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఎస్ భీమ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నేతలు ఉన్నారు.

## భైంసాలో పోలీసుల ప్రజావాణి

**టి మీడియా, డిసెంబర్ 2 ,భైంసా :**



భైంసా పట్టణంలో బుధవారం పోలీసుల ప్రజావాణి నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఏఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

## నకిలీ మందులు అమ్మితే కఠిన చర్యలు

- మండల వ్యవసాయ అధికారి, డాకేశ్వర్ గౌడ్

**టి మీడియా, డిసెంబర్ 2 , చిన్నంబాయి :**



మండల కేంద్రంలోని వెల్లటూరు గ్రామంలోని పెస్టిసైడ్ దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. అందులో భాగంగా ప్రతి డీలర్ కి ఇన్సెక్టిసైడ్ యాక్ట్ 1968 ప్రకారంగా సూచనలు చేయడం జరిగింది . దుకాణంలోని స్టాక్ రిజిస్టర్లు, బిల్ పుస్తకాలు, ఇన్వాయిసులు తనిఖీ చేయడం జరిగింది. ఎమ్ ఆర్ పిధరల కన్నా ఎక్కువ ధరకు విత్తనాలు, ఎరువులు మరియు పురుగు మందులు రైతులకు విక్రయించరాదు. కాలం చెల్లిన పురుగు మందులు, నిషేధించిన పురుగుమందులు ఎట్టి పరిస్థితుల్లో అమ్మ రాదు. స్టాక్ బోర్డ్ మరియు ధరల పట్టిక తప్పనిసరిగా కొనుగోలుదారులకు కనబడే విధంగా ఉంచవలెను. రైతులకు వారికి అమ్మిన విత్తనాలు, ఎరువులు మరియు పురుగుమందులకు సంబంధించిన బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలి. పై విధంగా పెస్టిసైడ్ డీలర్లకు సూచనలు చేయడం జరిగింది. పై సూచనలు పాటించకపోతే ఇన్సక్టిసైడ్ యాక్ట్ 1968 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోబడును.

## ఆర్కెపి ఓసి ప్రాజెక్ట్ ఫేజ్-టు

- పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహణ

**టీ మీడియా, డిసెంబర్ 2, రామకృష్ణాపూర్:**



మందమర్రి ఏరియా లోని రామకృష్ణాపూర్ ఓపెన్ కాస్ట్ ఫేజ్ %–%02 కి సంబంధించి 03.12.2025 అనగా బుధవారం ఉదయం 10.30 నిమిషాలకు ఓ.సి మహాలక్ష్మి కంపెనీ సమీపంలో నిర్వహించబోవు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ పనుల పురోగతిని మంగళవారం పరిశీలించిన ఏరియా జనరల్ మేనేజర్ ఎన్.రాధాకృష్ణ,ఎసిపి రవికుమార్ ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ ఈ ప్రజాభిప్రాయ సేకరణకు ప్రతి ఒక్కరూ హాజరై తమ యొక్క అభిప్రాయాలను తెలియజేయాలని వారు కోరారు. ఈ యొక్క ఓపెన్ కాస్ట్ వల్ల రామకృష్ణాపూర్ కు పూర్వ వైభవం వస్తుందని,అదేవిధంగా బుధవారం నిర్వహించబోయే ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన పనులను పరిశీలించి సంబంధిత అధికారులకు తగు సూచనలు సలహాలు తెలియపరుస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం జి.ఎల్ ప్రసాద్, డిజిఎం పర్సనల్ అశోక్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డి.జి.ఎం ఐఈడి కిరణ్ కుమార్, డీజీఎం ఈ ఎండమ్ దూప్ సింగ్, సీఐ శశిధర్ రెడ్డి ,ఎస్సై రాజశేఖర్ ,ఎన్విరాన్మెంటల్ అధికారి వెంకట్ రెడ్డి,డివై మేనేజర్ ఐటి రవి, ఎస్టేట్ ఆఫీసర్ నవనీత, సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## శాంతిఖని గనిలో దిగిన ఏఐటీయూసీ నేతలు..

**టీ మీడియా, డిసెంబర్ 2, బెల్లంపల్లి :**



బెల్లంపల్లి శాంతిఖనిలో మంగళవారం ఏఐటీయూసీ నాయకులు గనిలోకి దిగారు. ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్ నాయకత్వంలో లీడర్ల బృందం గని పరిస్థితిని పరిశీలించింది. శాంతిగనిలో గత 25 రోజులుగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో అందుకు గల కారణాలు, మైన్ యొక్క సేఫ్టీ, ప్రొడక్షన్ ఎలా ఉందో తెలుసుకోవడం కోసం నాయకులు గనిలోకి దిగారు. గనిని సందర్శించిన వారిలో శాంతిగని మైన్ ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతి గౌడ్, బెల్లంపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి, కాశీపేట–2 పిట్ సెక్రటరీ శ్రీనివాస్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మంతెన రమేష్, వర్క్ మెన్ ఇన్స్పెక్టర్ పొట్ల రాయలింగు, మైన్స్ కమిటీ సభ్యుడు దాడి రమేష్ ఉన్నారు.

## అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలి

- తహసీల్దార్ ఎల్లయ్య

**టి మీడియా, డిసెంబర్ 2 , చిన్న చింతకుంట:**



సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ప్రచారం కోసం పబ్లిక్ మీటింగ్ పెట్టుకోవడానికి, ర్యాలీలు నిర్వహించ డానికి, మైకులు పెట్టుకోవడానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని మండల తహసీల్దార్ ఎల్లయ్యతెలిపారు. పోలింగ్ పరిసమాప్తం కావ డానికి నిర్ణయించిన సమయానికి ముందు 44 గంటల నుండి బహిరంగ సభలను నిర్వహించటం, ఊరేగింపులు చేయడం నిషిద్ధమన్నారు. అనుమతి పొందిన బహిరంగ సమావే శాలు,రోడ్ షో ల వద్ద లౌడ్ స్పీకర్లు ఉదయం 6 గంటల నుండి రాత్రి పది గంటల మధ్య మాత్రమే ఉపయోగించాలన్నారు. ఈ నిబంధనను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే పోలీస్ అధికారులు లౌడ్ స్పీకర్ లను జప్తు చేయడానికి అధికారం కలిగి ఉంటారని పేర్కొన్నారు. సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు గ్రామ పంచాయతీ పరిధిలో తమ ప్రచారానికి ఒక వాహనాన్ని ఉపయోగించడానికి అనుమతి ఇస్తారని తెలిపారు. అభ్యర్థులు ప్రచారానికి వినియోగించేందుకు ప్రతిపాదించిన వాహనాల వివరాలను ముందుగా తెలియజేయాల్సి ఉంటుందన్నారు. వార్డు సభ్యుని పదవికి పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం కోసం ఎలాంటి వాహనాన్ని ఉపయోగించకూడదని వివరించారు.

**పోలింగ్ రోజున వాహనాల వినియోగం...**

పోలింగ్ రోజున గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థులు ఒక వాహనాన్ని ఉపయోగించేందుకు మాత్రమే అనుమతిస్తారని,పోలింగ్ రోజున ఇతర వాహ నాలను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరని చెప్పారు. వార్డు విస్తీర్ణం చాలా తక్కువ ఉంటుందని, వార్డు మెంబర్ పదవికి పోటీ చేసే అభ్యర్థులకు వాహన అనుమతి ఉండదన్నారు. నిర్ణిత నమూనాలో గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులకు పోటీ చేసే అభ్యర్థులకు మాత్రమే వాహన పర్మిట్లను జారీ చేస్తారని చెప్పారు. వాహన పర్మిట్ అసలు ప్రతి వాహనం ముందు వైపు అద్దంపై అభ్యర్థులు అతికించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ ఎన్నికల సందర్భంగా మండల పరిధిలోని రాజకీయ పార్టీల నేతలు ప్రజలు సహకరించాలని తెలిపారు.

## యాత్రానందం సర్వీసును సద్వినియోగం చేసుకోండి

- డిఎం పండరీ

**టి మీడియా, డిసెంబర్ 2 ,నిర్మల్ :**




భక్తుల సౌకర్యం కోసం టీజీ ఆర్టీసీ యాత్రానందం సర్వీస్ లను నడుపుతున్నట్లు నిర్మల్ డిఎం పండరీ తెలిపారు. మంగళవారం ఆర్టీసీ నిర్మల్ డిపో నుండి అరుణాచలంకు బస్సు బయలుదేరుతుందని తెలిపారు. మరుసటి రోజు ఉదయం కాణిపాకం వర సిద్ధివినాయకుణ్ణి దర్శించుకొని అరుణాచలం వెళ్తుంది. అరుణాచలంలో దర్శనం గిరి ప్రదక్షిణ చేసుకొని 4వ తేదీ రోజు తిరుపతి చేరుకుంటుంది. 5వ తేదీ తిరుమల వెంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం బయలుదేరి 6వ తేదీ జోగిలాంబాను దర్శనం చేరుకొని నిర్మల్ కు చేరుకుంటుంది. డిసెంబర్ 3వ తేదీ రోజు అరుణాచలంలో కార్తీక జ్యోతి వెలుగుతుంది. కావున నిర్మల్ మండలం అక్కాపూర్ ఒకే గ్రామం నుండి 35 మంది ప్రయాణికులు ఈ బస్సును బుక్ చేసుకోవడం గమనార్హం. ఇలాగే ఏ గ్రామానికైనా 30 మందికి పైగా ప్రయాణికులు ఉంటే మీరు కోరుకున్న బస్సు సౌకర్యం కలిపిస్తామని డిపో మేనేజర్ కే పండరి తెలిపారు. బస్సులో బయలుదేరుతున్న ప్రయాణికులకు డిపో మేనేజర్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధ్యాయుడి తీరుపై స్థానికుల ఆగ్రహం

- ఘటన స్థలంలోనే టీచర్‌ను సస్పెండ్ చేసిన డీఈవో

**టి మీడియా, డిసెంబర్ 2 ,ఆదిలాబాద్:**



విద్యార్థిని కించపరిచేలా వ్యవహరించిన ఉపాధ్యాయుడిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట విద్యార్థిని తల్లి తండ్రులు, కాలనీ వాసులు ఆందోళన చేపట్టడం స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆదిలాబాద్ పట్టణంలోని రణదివే నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఎం.డీ యూనుస్ పదవ తరగతి విద్యార్థినిని సామాజిక వర్గం పేరిట, కుటుంబ సభ్యులను కించపరిచేలా మాట్లాడారని..తెలుసుకుని విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. తమ ను కించపరిచే విధంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న ఇంచార్జ్ డీఈవో, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎంఈవో సోమయ్య లు ఘటన పై విచారణ చేపట్టారు. ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తున్నట్టు ఇన్చార్జి డీఈఓ రాజేశ్వర్ ప్రకటించడం తో కాలనీ వాసులు శాంతించారు. కాగా ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిందర్ వెల్లడించారు.

## బీఆర్ఎస్ ఆధ్వర్యంలోనే గ్రామల అభివృద్ధి సాధ్యం

- రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి

**టీ మీడియా, డిసెంబర్ 2,మేడ్చల్:**



బీఆర్ఎస్ తోనే గ్రామాలు అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని సోమవారం గ్రామ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని 50 మంది యువకులు పార్టీలో చేరారు. గోవర్ధన్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అభివృద్ధి మార్గంలో పయనించాయని తెలిపారు. భవిష్యత్తులో కూడా అభివృద్ధి కొనసాగాలంటే గ్రామాల్లో బీఆర్ఎస్ శక్తి మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల నమ్మకంతోనే పార్టీలో చేరికలు భారీ స్థాయిలో జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలలో బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నక్క వెంకటేష్ గౌడ్, సర్పంచ్ అభ్యర్థి యాదిగిరి యాదవ్, ముదిరికాచారి, విశాల్ గౌడ్ భార్గవ్ చారి, శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి,బాల్ రెడ్డి, నాగులు,వెంకటేష్, కాంతారావు, రాజు, యాదగిరి, రాహుల్ యాదవ్, జనార్ధన్, బన్నీ, శేఖర్, ఆసిఫ్, నాయకులు,యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లోకో రన్నింగ్ ఉద్యోగులు నిరాహార దీక్ష

**టీ మీడియా, డిసెంబర్ 2బెల్లంపల్లి :**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రైల్వే స్టేషన్లో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఏఐఎల్ఆర్ఎస్ ఆధ్వర్యంలో లోకో రన్నింగ్ ఉద్యోగులు మంగళవారం సామూహిక నిరసన దీక్ష చేశారు. రన్నింగ్ సిబ్బంది పని గంటలు తగ్గించాలని, ఇవ్వాలని వారాంతపు విశ్రాంతి ఇవ్వాలని, బయట స్టేషన్ విశ్రాంతి (8o2) గంటలు అమలు చేయాలని, హెడ్ క్వార్టర్ విశ్రాంతి ( 16o2) గంటలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ ఎస్ ఏ) బ్రాంచ్ కార్యదర్శి రవీంద్రర్ రామ్, ఆర్గనైజింగ్ కార్యదర్శిలు ఏకే మోరే, నాగేంద్ర కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



## తీవ్రత పెరగక ముందే చికిత్స అందించండి

- స్క్రబ్‌టైఫస్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

**టీ మీడియా, డిసెంబర్ 2, అమరావతి బ్యూరో :**

స్క్రబ్‌టైఫస్ పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ వ్యాధికి సంబంధించిన కేసుల నమోదుపై వైద్యారోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి సౌరభ్ గౌర్‌తో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఇటీవల విజయనగరం జిల్లాలో స్క్రబ్ టైఫస్ బారిన పడి చందక రాజేశ్వరి అనే మహిళ మృతి చెందిన తరహా ఘటనలు మరెక్కడా జరగకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. చిగ్గర మైట్ తరహా కీటకాలు కుట్టడం వల్ల వచ్చే వ్యాధితో పాటు, ప్రమాదాన్ని ఏ విధంగా కట్టడి చేయాలనే దానిపై ప్రజలకు వివరించాలని సూచించారు. విజయనగరానికి చెందిన రాజేశ్వరీ అనే మహిళను చిగ్గర్ మైట్ అనే కీటకం కుట్టిందని, దీంతో ముందుగా టైఫాయిడ్ చికిత్స అందించారని ఆ తర్వాత రాపిడ్ టెస్ట్ ద్వారా స్క్రబ్ టైఫస్ పాజిటివ్ అని తేల్చారని సౌరభ్ గౌర్ సీఎంకు వివరించారు. విజయనగరం క్వాసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాజేశ్వరి చనిపోయారని అధికారులు చెప్పారు. స్క్రబ్ టైఫస్ కేసులు, ఆ వ్యాధి లక్షణాలు, వాటి వల్ల ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోననే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ఓరింటియా సుసుగాముషి అనే బాక్టీరియా ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుందని, ఇది అంటువ్యాధి కాదని అధికారులు స్పష్టం చేశారు. చిగ్గర మైట్స్ అనే కీటకాలు కుట్టడం ద్వారా ఈ వ్యాధి వస్తుందని, అధిక జ్వరం, చలి, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులతోపాటు మైట్ కుట్టిన తర్వాత పుండ్లు ఏర్పడడం వంటివి ఈ వ్యాధి లక్షణాలని సీఎంకి తెలిపారు. సకాలంలో చికిత్స అందిస్తే, ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెప్పారు. ఇప్పటివరకు 145 కేసులు నమోదు: వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం జనవరి నుంచి ఇప్పటివరకు సుమారు 145 కేసులు నమోదయ్యాయి. పొరుగు రాష్ట్రాల్లో ఉంటున్న 234 మందిలో ఇది వెలుగు చూసింది. మొత్తంగా 379 కేసులు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే కేసులను కలుపుకొంటే ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందని అంచనా.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు
- ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు..

**టీ మీడియా, డిసెంబర్ 2, పాపన్నపేట :**



ఈ నెల 11న జరుగనున్న మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మెదక్ ఎస్పీ శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని అనంతుని కొత్తపల్లిలోని అనంత పద్మనాభ స్వామి ఫంక్షన్ హాల్ లో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో టేక్మాల్ మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన శాబాద్ తాండ, సీఎం తాండ, ఎల్లుపేట, ఎల్పుగొండ గ్రామాలకు చెందిన ప్రజలకు పాపన్నపేటలోని కొత్తపల్లి, అబ్లపూర్, అన్నారం గ్రామాలకు చెందిన ప్రజలకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

ఎన్నికల్లో ఎవరైనా ఎన్నిక ప్రక్రియ కోడ్ ను ఉల్లంఘించిన, అధికారుల విధులకు ఆటంకాలు కలిగించిన చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి విభేదాలు, వర్గపోరు సృష్టించకుండా కలిసిమెలిసి ఉండాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కును ప్రశాంతంగా, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో గొడవలకు కారణమైన వారిని ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగిందని, వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరిగి ఇలాంటి ఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అభ్యర్థులు మద్యం, డబ్బులు, ప్రోత్సకాలతో ఓటర్లను మభ్యపెడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్నికల సమయంలో కేసులు నమోదు కావడం మూలంగా భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కోల్పోతారని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా యువత ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి వారి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ప్రజలు ఇరు పార్టీల నాయకులు పోలీసులకు సహకరించాలని కోరారు. సోషల్ మీడియాలో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని, అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, రూరల్ సీఐ జార్జ్, ఎస్బి సీఐ సందీప్ రెడ్డి, సిసిఎస్ సీఐ రాజశేఖర్ రెడ్డి, స్థానిక ఎస్ఐ సార శ్రీనివాస్ గౌడ్ వివిధ గ్రామాల నాయకులు, ప్రజలు ఉన్నారు.